క్లుప్తంగా

ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ శిబిరం సందర్శన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని డివిజనల్ రిసోర్స్ సెంటర్‌లో కొనసాగుతున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

సిర్పూర్(టి): మండలంలోని పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ మంగళవారం సిర్పూర్(టి) మండల పాత్రికేయులు తహసీల్దార్ రియాజ్‌అలీకి వినతి పత్రం అందజేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జమీల్, సిర్పూర్(టి) ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బి.రాజు, ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, ఉపాధ్యక్షుడు బాస సంతోష్, ప్రెస్‌క్లబ్ సభ్యులు శ్రీకాంత్, రాపల్లి కృష్ణ, తులసీదాసు, శంకర్, శ్రీధర్, రాజశేఖర్, ప్రసాద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై పార్టీ నాయకులతో సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ రహీముద్దీన్

వాంకిడి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రహీముద్దీన్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పార్టీ నాయకులను కోరారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఆర్‌ఐలు మాజిద్, ప్రమీల, సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి చేయాలి



జెండా ఎగురవేస్తున్న ముంజం శ్రీనివాస్

దహెగాం: కార్మికుల హక్కుల సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మేడే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడి పాలనలో స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాలి, కృష్ణమాచారి, నాయకులు వజ్రమ్మ, శోభ, మమత, సవిత, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత


పుస్తెమెట్టెలు అందజేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్: పేదింటి ఆడపడుచు వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో పుస్తెమెట్టెలు, చీర, సారెను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. కాళేశ్వరానికి చెందిన తోట సత్యనారాయణ కుమార్తె మానస వివాహం సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్ప శ్రీనివాస్ అందజేశారు. ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, నాయకులు గుండ వెంకన్న, ప్రమోద్, మధుకర్, బాలేశ్వర్, వేణు, అభిలాష్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

కిడ్నీ జబ్బులపై అవగాహన

శ్రీరాంపూర్: సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్కే 7గనిపై కిడ్నీ జబ్బులు, వడదెబ్బలపై ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. కిడ్నీలు కాపాడుకోవడానికి ఎక్కువగా నీరు, పండ్ల రసాలు తాగాలన్నారు. రక్తపోటు, మధుమేహం ఉన్న వారు తరచూ కిడ్నీ పరీక్షలు చేసుకోవాలన్నారు. ధూమపానం, మద్యం సేవించరాదన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

దండెపల్లి: మండలంలోని రెబ్బెనపల్లిలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఎల్లమ్మ పట్నాలు నిర్వహించారు. గౌడ కులస్తులు ఎల్లమ్మకు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనంతరం పట్నాలు వేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బోనాల జాతరకు హాజరయ్యారు.

జలపాతంతో ఉపాధి..!

- 'చింతలమాదర' నిర్వహణకు సిబ్బంది నియామకం
- 10 మందితో ఎకో టూరిజం కమిటీ
- ఏటా పెరుగుతున్న ఆదరణ
- ఇప్పటివరకు రూ.2.60 లక్షల ఆదాయం


చింతలమాదర జలపాతం(ఫైల్)

తిర్యాణి: మండలంలో ప్రకృతి అందాలకు, ఆకట్టుకునే జలపాతాలకు కొదువలేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు మండలమంతా పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు జలపాతాల గలగలలు కనులవిందు చేస్తుంటాయి. కాగా మండలంలోని పర్యాటక ప్రాంతంలోని ఆదివాసీలకు ఉపాధి కల్పించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండలంలోని మందగూడ గ్రామపంచాయతీ పరిధిలోని చింతలమాదర జలపాతంతో గ్రామంలోని 10 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

పెరుగుతున్న ఆదరణ

దాదాపు పదేళ్ల క్రితం వెలుగులోకి వచ్చిన చింతలమాదర జలపాతానికి క్రమంగా ఆదరణ పెరుగుతోంది. జలపాతాన్ని చూసేందుకు ప్రతీ ఏడాది జూలై నుంచి నవంబర్ వరకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి నిత్యం వేలాది సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపవుతోంది. ఇప్పటివరకు దాదాపు 1.50లక్షల మంది పర్యాటకులు జలపాతాన్ని వీక్షించేందుకు వచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు. అధికారులు జలపాతం అభివృద్ధికి ప్రభుత్వానికి నివేదికలు పంపగా సంబంధిత శాఖ అధికారులు 15, ఏప్రిల్, 2020 నుంచి ఎకో టూరిజం కిందకు తీసుకొచ్చారు. కాగా 2021లో ఎకో టూరిజం కమిటీ (ఈటీసీ)ని నియమించి జలపాతం నిర్వహణ చేపడుతున్నారు. కాగా అప్పటి నుంచి జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకుల నుంచి కొంత రుసుం వసూలు చేస్తున్నారు. సందర్శనకు వచ్చే వారికి రూ. 30, ద్విచక్ర వాహన పార్కింగ్‌కు రూ. 20, కారు, ఇతర వాహనాలకు రూ. 100 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. వీటి ద్వారా జలపాతానికి ఇప్పటివరకు రూ. 2.60 లక్షల ఆదాయం సమకూరినట్లుగా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వచ్చిన ఆదాయంలో 80శాతం జలపాతం అభివృద్ధికి, కమిటీ సభ్యుల వేతనాలకు ఖర్చు చేస్తుండగా, మిగతా 20శాతం ఆదాయాన్ని గ్రామపంచాయతీకి అందజేస్తున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు..

గతంలో జలపాతం వద్ద జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని నివారణకు కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు. జలపాతం వద్దకు మత్తు పానీయాలు, ప్లాస్టిక్ వస్తువులు తీసుకు రాకుండా పరిసరాల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. పర్యాటకుల సామగ్రిని తనిఖీ చేసిన తర్వాతనే అధికారులు జలపాత సందర్శనకు అనుమతిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా జలపాతం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. పర్యాటకులు నీళ్లలోకి దిగకుండా సిబ్బందిని సైతం నియమించారు. దీంతో పాటు గజ ఈతగాళ్లను సైతం జలపాతం వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో కొంతమంది స్థానికులకు ఉపాధి లభిస్తోంది.

తాత్కాలికంగా ఉపాధి కల్పిస్తున్నాం



జలపాతం వద్ద గ్రామంలోని పది మంది యువకులకు తాత్కాలికంగా ఉపాధి కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు జలపాతం ద్వారా రూ. 2.60 లక్షల ఆదాయం సమకూరింది. వీటిలో 80శాతం జలపాతం అభివృద్ధి, కమిటీ సభ్యుల వేతనాలకు వినియోగిస్తుండగా, మరో 20శాతం గ్రామపంచాయతీకి అందజేస్తున్నాం.

– తురం గోపాల్, ఈటీసీ చైర్మన్

జలపాతం గురించి వివరిస్తా



సందర్శనకు వచ్చే పర్యాటకులకు జలపాతం గురించి వివరిస్తా. ఇందుకు నాకు నెలకు రూ. 7వేలు వేతనం ఇస్తున్నారు. జలపాతం నిర్వహణతోపాటు నా సొంత పనులు కూడా చేసుకుంటున్న. జలపాత సందర్శనకు వచ్చే పెద్దస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను నేరుగా కలిసి వారికి వివరించడం ఎంతో సంతోషంగా ఉంది.

– చిక్రం శంకర్, గైడ్

విమానం చక్కర్లు.. ఆందోళనలో ప్రజలు

- సిర్పూర్ నియోజకవర్గంలో తిరుగుతున్న విమానం
- తక్కువ ఎత్తులో విహరిస్తున్న వైనం
- సమాచారం లేదంటున్న అధికారులు


తక్కువ ఎత్తులో వెళ్తున్న మినీ జెట్ విమానం

కౌటాల: సిర్పూర్(టి) నియోజకవర్గంలోని కౌటాల, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలాల్లోని పలు గ్రామాల మీదుగా కొద్ది రోజులుగా ఓ జెట్ విమానం చక్కర్లు కొడుతుంది. తక్కువ ఎత్తులో విమానం తిరుగుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులకు సైతం ఎటువంటి సమాచారం లేకపోవడంతో సస్పెన్స్ నెలకొంది.

తక్కువ ఎత్తులో..

కాగజ్‌నగర్, కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో మినీ జెట్ విమానం ప్రతీరోజు ఏదో ఒక గ్రామం మీదుగా చక్కర్లు కొడుతుండడం చర్చనీయాంశంగా మారింది. గత 25 రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మొదట్లో కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం, కౌటాల మండలం పార్డీ, సాండ్‌గాం గ్రామాల వైపు చక్కర్లు కొట్టిన మినీ జెట్ విమానం వారం రోజులుగా కౌటాల, చింతలమానెపల్లి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల మీదుగా మహారాష్ట్ర వైపు వెళ్తోంది. విమానం చక్కర్లు కొట్టిన మొదట్లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నుంచి మహారాష్ట్రలోని గడ్చిరోలి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం సర్వే చేస్తున్నట్లు భావించినప్పటికీ రోజుకో గ్రామం మీదుగా తక్కువ ఎత్తులో తిరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చక్కర్లతో.. చర్చలు

కౌటాల మండలంలోని పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి, గుడ్లబోరి, గురుడుపేట, బోదంపల్లి, చింతలమానెపల్లి మండలంలోని కోర్సిని, అంబగట్ట, భూరెపల్లి, గంగాపూర్, బాలజీఅనుకోడ గ్రామాల మీదుగా జెట్ విమానం రోజుకు రెండుమూడు సార్లు తక్కువ ఎత్తులో చక్కర్లు కొడుతుండడంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. బెల్లంపల్లి –మహారాష్ట్ర మీదుగా నాలుగు వరుసల రహదారి నిర్మాణంపై సర్వే చేస్తున్నారని బీజేపీ నాయకులు చెబుతుండగా.. కౌటాల మండలంలోని వీర్దండి వద్ద వార్ధా బ్యారేజీ నిర్మాణం కోసం సర్వే కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. 25 రోజులుగా విమానం చక్కర్లు కొడుతున్నా అధికారులకు సైతం పూర్తి సమాచారం లేకపోవడం గమనార్హం.

ఎలాంటి సమాచారం లేదు



కొద్ది రోజులుగా కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా జెట్ విమానం చక్కర్లు కొడుతున్న మాట వాస్తవం. జెట్ విమానం తక్కువ ఎత్తులో ఎందుకు చక్కర్లు కొడుతుందో పోలీస్ శాఖ తరుపున తమకు పూర్తి సమాచారం లేదు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు భూసేకరణ కోసం సర్వే చేస్తున్నట్లు భావిస్తున్నాం.

– సాదిక్ పాషా, సీఐ, కౌటాల

ధాన్యం కొనుగోళ్ల చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో 2020 –21 సంవత్సరంలో జరిపిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్ చెక్కులను మంగళవారం అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తారమాణికి కలెక్టర్ హేమంత్ బోర్కడే అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో రూ.73 లక్షల ధాన్యం, ఐకేపీ ఆధ్వర్యంలో రూ.15 లక్షల ధాన్యం కొనుగోళ్లు చేయగా చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి


చౌపన్‌గూడలో బ్రాంచ్ ప్రారంభిస్తున్న సతీష్

వాంకిడి: తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ కాగజ్‌నగర్ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని వెల్గీ, మారెపల్లి, సవాతి, చౌపన్‌గూడ గ్రామ పంచాయతీలకు నూతనంగా మంజూరైన బ్రాంచి తపాలా కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసు సేవలను గ్రామీణ ప్రజలకు మరింత చేరువలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన బ్రాంచి కార్యాలయాలను మంజూరు చేసిందన్నారు. పోస్టాఫీసుల్లో బ్యాంకింగ్ సేవలతో పాటు తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బోనస్ పొందే లాభదాయకమైన ఇన్సురెన్స్ పాలసీలు ఉన్నాయన్నారు. వెల్గీ ఇన్‌చార్జి బీపీఎంగా జాడె భక్తరాజ్, మారెపల్లి ఇన్‌చార్జిగా శివకుమార్, సవాతీ ఇన్‌చార్జిగా ఎంఏ లతీఫ్, చౌపన్‌గూడ ఇన్‌చార్జిగా చంద్రబాన్‌లకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు మనోహర్, పెందూర్ పవన్, దేవ్‌రావు, సిడం అన్నిగా, ఎంపీటీసీ హిడ్మె ప్రవీణ్, ఉప సర్పంచులు భీంరావు, జుగాదిరావు, ఎమ్‌వోలు కాశయ్య, తాజ్ముల్ హుస్సేన్ గ్రామ పటేళ్లు, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ మంగళవారం తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు ఎంపీపీ డుబ్బుల నానయ్య అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

'మాయమాటలు నమ్మి మోసపోవద్దు'

కాగజ్‌నగర్‌టౌన్: కాంట్రాక్టు కార్మికులు మాయమాటలు నమ్మి మోసపోవద్దని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలెం వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానికంగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులను అధికార పార్టీ ఎమ్మెల్యే మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల ముందు ఎస్పీఎం మిల్లు పునరుద్ధరణ సందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా, ప్రస్తుతం మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రస్తుతం వడ్డీతో సహా కాంట్రాక్టు కార్మికుడికి రూ. లక్ష చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. మిల్లులో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!


బురదమయంగా నాగేపల్లి రోడ్డు

కౌటాల: మండలంలోని నాగేపల్లి గ్రామంలో గల అంతర్గత రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలోని బీసీ కాలనీలో గల మొరం రోడ్డు అకాల వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో కాలనీ వాసులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ టేలాలు వెంటనే తొలగించాలి


అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాను చూపుతున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా వెలుస్తున్న టేలాలను అధికారులు వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం గంగాపూర్ పంచాయతీ పరిధిలో గల రామాలయం, పశువుల సంత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో విచ్చలవిడిగా వెలిసిన టేలాలను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జెడ్పీ హైస్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో టేలాలను ఏర్పాటు చేస్తూ పాఠశాల స్థలాన్ని, రోడ్డును ఆక్రమిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వట్టివాగు కాలువకు సంబంధించిన స్థలంలో, గంగాపూర్, నంబాల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, రైతువేదిక స్థలాన్ని దర్జాగా ఆక్రమంచి టేలాలు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, నాయకులు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలి

జైపూర్: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లు, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని రామారావుపేట గ్రామ పంచాయతీని మంగళవారం మొబైల్ తనిఖీల్లో భాగంగా స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. నర్సరీని సందర్శించి మొక్కలకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నీటిని అందించాలని, కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డులో కంపోస్ట్ పిట్‌లో కంపోస్ట్ ఎరువు తయారీ విధానం పరిశీలించి, తయారు చేసిన కంపోస్ట్ ఎరువును నర్సరీ, పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు వినియోగించాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. తొలిసారి గ్రామపంచాయతీ గ్రామానికి వచ్చిన డీపీవో వెంకటేశ్వర్‌రావును స్థానిక సర్పంచ్ నామాల సత్యవతి, ఉపసర్పంచ్ తంగళ్లపల్లి వెంకటేశ్, వార్డు సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆయనతో ఎంపీవో అనిల్‌కుమార్, పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఉన్నారు.

వీవోఏల డిమాండ్లు నెరవేర్చాలి


కెరమెరి: ఆందోళన చేస్తున్న వీవోఏలు

కెరమెరి: వీవోఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జాదవ్ రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో, మండల సమాఖ్య కార్యాలయాల ఎదుట నిర్వహించిన నిరసనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వీవోఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు కూటికల ఆనందరావు, విజయ్, పంచాయతీ కార్మికులు అనిల్, రాజు, జైవంత్ తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: ఐకేపీ వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట మండలంలోని వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 16వ రోజు మంగళవారం కొనసాగింది. సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్, వీవోఏలు రవి, కొండయ్య, మహేశ్వరి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మంగళవారం సమ్మె 16వ రోజుకు చేరుకుంది. సంఘం గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కార్యదర్శి సుజాత, మాధవరావు, సీలయ్య, సత్తయ్య, శంకర్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలపై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొట్నాక్ విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సుంగాపూర్‌ను సందర్శించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుంగాపూర్ గొందుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు దాదాపు మూడు కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి నీటిని తెచ్చుకోవడం బాధాకరమన్నారు. ఐటీడీఏ ఉన్నా గిరిజనుల సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బావి నుంచి ప్రత్యేక పైపులైన్ వేసి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్కా బాపురావు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పారాణి, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, నాయకులు తుంరం సంతోష్, పుందూర్ మధు, రాహూల్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ల విడుదల


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్సై, నాయకులు

దహెగాం: అంబేద్కర్ విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్లను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సనత్‌కుమార్, అంబేద్కర్ సంఘం నాయకులు విడుదల చేశారు. మండలంలోని హత్తిని గ్రామంలో ఈనెల 15న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు శంకర్, కుమ్మరి రాజయ్య, రాంటెంకి మల్లేష్, మధుకర్, సునీల్, దుర్గం రాజన్న, నాగేందర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వీర్దండిలో విగ్రహావిష్కరణ

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. నేడు మధ్యాహ్నం 2 గంటలకు గ్రామంలో ధమ్మ ర్యాలీ అనంతరం సాయంత్రం 6 గంటలకు భంతే ధమ్మ సారధి నాగపూర్ చేతుల మీదుగా నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలపై చర్య తీసుకోవాలి


డ్రైవర్‌తో మాట్లాడుతున్న సుజాయత్ ఖాన్

కెరమెరి: కెరమెరి ఘాట్‌లో నిత్యం ఎన్నో వాహనాలు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నా జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయత్ ఖాన్ ఆరోపించారు. మంగళవారం ఆయన ఘాట్‌రోడ్డుపై ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాల డ్రైవర్లు, యజమానులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి అధిక లోడ్‌తో ప్రయాణించే వాహనాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899